JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 29-04-2026

Medchal - Malkajgiri । Wednesday 29-04-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 332

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 332 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com





## ఇవాళ బెంగాల్ రెండో దశ ఎన్నిక

- ఈ విడతలో 142 స్థానాలకు ఎన్నికలు
- బెంగాల్ పీఠం ఎవరిదో తేల్చే అసలైన ఫైనల్ ఫైట్ ఇదేనని రాజకీయ విశ్లేషకులు
- ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెంగాల్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని వ్యూహాత్మక అడుగులు

**జయభేరి, కోల్ కత్తా, ఏప్రిల్ 28 :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుకుంది. మొత్తం 294 స్థానాలకు గాను ఇప్పటికే తొలి దశ పోలింగ్ ముగియగా, బుధవారం జరగనున్న రెండో, చివరి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ విడతలో 142 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండటంతో, బెంగాల్ పీఠం ఎవరిదో తేల్చే అసలైన ఫైనల్ ఫైట్ ఇదేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కోల్‌కతా సహా ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గాల్లో సుమారు 3.21 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పును వెలువరించనున్నారు.ఈ ఎన్నికలను కేంద్రంలోని బీజేపీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెంగాల్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని ...మిగతాది 2 లో

## భారత్ చేతిలోకి దావూద్ ఇబ్రహీం రైట్ హ్యాండ్

- ఇస్తాంబుల్‌లో సలీం డోలాను అరెస్ట్ చేసిన నిఘా వర్గాలు
- ప్రత్యేక విమానంలో దేశ రాజధాని ఢిల్లీకి తరలింపు



**జయభేరి, న్యూఢిల్లీ :**

అండర్ వరల్డ్ సామ్రాజ్యంలో ఎదురు లేని డాన్‌గా ఎదిగిన దావూద్ ఇబ్రహీం రైట్ హ్యాండ్ తాజాగా భారత ఏజెన్సీల వలలో చిక్కాడు. అక్షరాలా రూ. 5,000 కోట్ల డ్రగ్స్ సామ్రాజ్యాన్ని నడిపిస్తూ, దేశ రక్షణకు ముప్పుగా మారిన సలీం డోలాను తాజాగా అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా ఇస్తాంబుల్ ...మిగతాది 2 లో



## దేశ వైద్య రంగంలో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- దేశంలో 50 శాతంపైగా వైద్య సౌకర్యాలు తెలంగాణ నుంచి అందాలన్న లక్ష్యం
- ఇప్పుడు దేశం నుంచి ఎగుమతి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్ నుంచి అవుతున్నాయి
- అంతర్జాతీయ స్థాయిలో ఒక బ్రాండ్. అపోలో అనే మాట సహాయం ఆశిస్తున్న కోట్లాది మంది మనసుల్లో నిలిచింది

**జయభేరి, హైదరాబాద్ :**

దేశంలోని వైద్య రంగంలో 50 శాతానికి పైగా సేవలు తెలంగాణ నుంచి అందించాలన్న లక్ష్యంగా రాష్ట్రంలోని ఆసుపత్రులు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిలషించారు. అందుకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అపోలో హాస్పిటల్ ను మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డితో పాటు యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. "మెడికల్ టూరిజం కోసం మొన్నటివరకు ఒక పాలసీ లేదు. తమ ప్రభుత్వం ఒక పాలసీ తీసుకొచ్చింది. వైద్య రంగం అభివృద్ధికి అన్ని ...మిగతాది 2 లో



## ఇవాళ టెన్త్ ఫలితాలు

- వాట్సాప్‌లోనే 10వ తరగతి ఫలితాలు చెక్ చేసుకోండి.
- ఫోన్ నెంబర్ 8096958096కి మీ వాట్సాప్‌లో Hi అని పంపాలి
- తర్వాత SSC Results టైప్ చేసి హాల్‌టికెట్ నంబర్ ఎంటర్ చేయాలి

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 28 :**

తెలంగాణ పదో తరగతి విద్యార్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎస్సీఈఆర్టీ (SCERT) కార్యాలయంలో విద్యాశాఖ 10వ తరగతి ఫలితాలను అధికారికంగా విడుదల చేయనుంది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు తెలంగాన వ్యాప్తంగా మొత్తం 5,28,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 5.17 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా, 10 వేల మందికి పైగా సప్లిమెంటరీ విద్యార్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అధికారిక వెబ్‌సైట్ https://bse.telangana.gov.in/ ఈ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా విడుదల చేయనున్నారు. పరీక్షలు ముగిసిన తక్కువ కాలంలోనే ఆన్సర్ షీట్ల వాల్యుయేషన్ ప్రక్రియను పూర్తి చేసిన విద్యాశాఖ, విద్యార్థుల పై చదువులకు ఆటంకం కలగకుండా ...మిగతాది 2 లో

## అప్పుడు సైబరాబాద్.. ఇప్పుడు గూగుల్ రాకతో విశాఖ




- విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలుస్తుంది
- రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా చంద్రబాబు పలు కీలక ప్రకటనలు

**జయభేరి, విశాఖపట్నం, ఏప్రిల్ 28 :**

ప్రపంచమంతా గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే.. గూగుల్ మాత్రం ఏపీని ఎంచుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుట్టిన రోజు ఇది. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలుస్తుందన్నారు.. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇదేనని.. దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ, ఈ ప్రాజెక్టు కేవలం విశాఖకే కాకుండా మొత్తం ...మిగతాది 2 లో



## హైకోర్టుకు అషురెడ్డి

- ధర్మేంద్రను అషు రెడ్డి పెళ్లి పేరిట మోసం
- భారత్‌కు వచ్చిన టైంలో పరిచయం చేసుకుని ప్రేమ, పెళ్లి పేరుతో డబ్బులు
- అషు రెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 28 :**

బిగ్ బాస్ ఫేం, హీరోయిన్ అషు రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని ఆమె క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కనీసం తన వెర్షన్ వినకుండానే కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన ప్రతిష్టను దెబ్బ తీసేందుకే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని... పోలీసుల తదుపరి చర్యలను అడ్డుకోవాలని ఆమె కోర్టును కోరారు. త్వరలోనే ఈ పిటిషన్ విచారణకు రానుంది. హైదరాబాద్ షేక్ పేట్‌కు చెందిన సత్యనారాయణ తన కుమారుడు ధర్మేంద్రను అషు రెడ్డి పెళ్లి పేరిట మోసం చేసిందంటూ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. లండన్‌లో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ అయిన తన కొడుకు 2018లో భారత్‌కు వచ్చిన టైంలో పరిచయం చేసుకుని ప్రేమ, పెళ్లి పేరుతో డబ్బులు అడిగిందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్లు, ఆస్తులు, బంగారం కొనుగోలు చేసి తన పేరిట రిజిస్టర్ చేయించుకుందని... పెళ్లి పేరెత్తితే ...మిగతాది 2 లో




## చమురు కూటమికి యూఏఈ గుడ్ బై..!

- అంతర్జాతీయంగా ప్రకంపనలు..!
- జాతీయ ప్రయోజనం, ప్రపంచ మార్కెట్ అవసరాలను సమర్థవంతంగా తీర్చడమే ఈ నిర్ణయానికి కారణం

**జయభేరి, న్యూఢిల్లీ :**

అంతర్జాతీయ ఇంధన రంగంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్పోర్టింగ్ కంట్రీస్, విస్తృత OPEC+ కూటమి నుండి లాంఛనంగా వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దీంతో దాదాపు ఆరు దశాబ్దాల సభ్యత్వానికి యూఏఈ ముగింపు పలికినట్లయింది. ఇది ప్రపంచ చమురు ధరలను నియంత్రించే ఒపెక్ సామర్థ్యంపై ప్రభావం చూపనుంది. రాష్ట్ర వార్తా సంస్థ WAM ద్వారా, యూఏఈ ఇంధన మంత్రిత్వ శాఖ, తమ ఉత్పత్తి విధానంపై "సమగ్ర సమీక్ష" తర్వాత ఈ నిర్ణయం ప్రకటించింది. ...మిగతాది 2 లో

# అక్రమార్కుల అడ్డాగా మున్సిపాలిటీ కార్యాలయం

- అనుమతులు లేకపోయినా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న భవన నిర్మాణాలు
- ప్రభుత్వం ఇచ్చే జీతాలు తక్కువటా...? అందుకే అక్రమ సంపాదన పై అధికారులకు మక్కువటా...?
- రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు... ముడుపులకు ముచ్చట పడుతున్న అధికారులు...
- అధికారుల కనుసన్నాల్లో సెల్లార్లు కమర్షియల్ బహుళ అంతస్తుల భవనాలు
- బోర్డులు నాటిన భూముల్లో భారీ భవనాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- మున్సిపల్ నిబంధనలు ఏటిలో కలుస్తున్నాయని స్థానికుల మండిపాటు
- గృహ నిర్మాణాల రద్దు కారణంగా మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి
- బాధ్యతలు మరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్
- దొడ్డి దారిన కోట్లు దండుకుంటున్న అధికారుల ఆస్తులపై దర్యాప్తు చేపట్టాలని విన్నపాలు

**జయభేరి, జవహర్ నగర్ :**




జవహర్ నగర్ మున్సిపాలిటీ కార్యాలయం అక్రమార్కుల అడ్డగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మున్సిపాలిటీ నిబంధనలను ఉల్లంఘించి రోడ్ల స్థలాలను ఆక్రమిస్తూ ప్రధాన రహదారుల పై భారీ సెల్లార్ లు బహుళ అంతస్తుల కమర్షియల్ భవన నిర్మాణాలు కొనసాగిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేతులు ముడుచుకొని చోద్యం వహిస్తు మున్సిపాలిటీ నిబంధనలకు విఘాతం కల్పిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు భవిష్యత్తు తరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నగరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పురపాలక నిబంధనల ప్రకారం ఒక ప్లాట్ లో నిర్మాణం చేపట్టాలంటే గోడ సరిహద్దు నుండి కొంత స్థలాన్ని వదిలిపెట్టి నిర్మాణం చేపట్టాలి అనే నిబంధనలను ఏమాత్రం జవహర్ నగరం పురపాలక సంఘం అధికారులు పాటించక పోవడమే కాకుండా ఏకంగా ఇరువైపులా రోడ్లను ఆక్రమిస్తూ భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగే విధంగా నిర్మాణాలు చేస్తున్నప్పటికీ పలుచోట్ల మూడు నాలుగు అంతస్తులు సెల్లార్ల తో కూడిన కమర్షియల్ భవన నిర్మాణాలు వ్యదేచ్చగా జరుగుతున్నప్పటికీ చీమకుట్టినంత చలనం లేకుండా స్థానికుల నుండి వస్తున్న



ఫిర్యాదులను ఏమాత్రం లెక్క చేయకుండా విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తు జవహర్ నగర్ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు బగ్గుమంటున్నారు.

**దొడ్డిదారిన దోపిడీకి పాల్పడుతున్న అధికారులను విధుల నుండి తొలగించాలి**

జవహర్ నగర్ ప్రాంతంలో గృహ నిర్మాణాలకు అనుమతులు లేకపోవడం అధికారులు దొడ్డి దారిన దోపిడీకి పాల్పడేందుకు సులువైన మార్గం అయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గత ఆరు సంవత్సరాల నుండి గృహ నిర్మాణాలకు అనుమతులు లేవంటూ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామంటూ తొలుత నిర్మాణదారులను భయ భ్రాంతులకు గురిచేసి తెరచాటుగా భవన నిర్మాణం పనులు సాఫీగా కొనసాగాలంటే గ్రౌండ్ ఫ్లోర్ భవన నిర్మాణానికి ఒక లక్ష రూపాయలు మొదటి అంతస్తు నిర్మాణానికి ఒక లక్ష యాభై వేలు రెండవ అంతస్తుల నిర్మాణానికి రెండు లక్షలు అంతకుమించి మునిసిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మించే బహుళ అంతస్తుల నిర్మాణాలు సెల్లార్లతో కూడిన కమర్షియల్ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు పెద్ద మొత్తంలో ఒప్పందం చేసుకుంటూ అంతా మా ఇష్టం మేమే రాజులం మేమే మంత్రులం అన్నట్లుగా అనుమతులు లేని భవన నిర్మాణాల తతంగాన్ని కొనసాగిస్తూ అధికారులు దొడ్డి దారిన దోపిడీకి పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు అధికారులు ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా బాధ్యతయుతంగా విధులు నిర్వహించిన యెడల గృహ నిర్మాణాలకు అనుమతులు లేకుండా మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వందలాదిగా భవన నిర్మాణాల తతంగం ఏలా కొనసాగుతుందని అనుమతులు లేకుండా నిర్మించే భవన నిర్మాణాలను అరికట్టేందుకు అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూడకపోవడం లో ఆంతర్యం ఏమిటీ...? అని ప్రశ్నిస్తున్నారు అధికారులు దొడ్డి దారిన దోపిడీకి పాల్పడుతున్నారు అనడానికి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ భవన నిర్మాణాలు నిలువెత్తు నిదర్శనం కాదా...? అని నిలదీస్తున్నారు జిల్లా కలెక్టర్ జిహెచ్ఎంసి అధికారులు దృష్టి సారించాలి అధికారుల అక్రమాస్తులపై దర్యాప్తు జరిపించాలి. ప్రభుత్వం ఇచ్చే జీతాల కన్నా అక్రమ మార్గంలో వచ్చే అధిక సంపాదనకు ఆసక్తి చూపుతూ అధికారులు మున్సిపల్ నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా స్థానికుల ఫిర్యాదులను లెక్కచేయకుండా అనుమతులు లేకుండా నిర్మాణం అవుతున్న భవన నిర్మాణాలను అరికట్టేందుకు ఏ మాత్రం సుముఖత చూపకుండా వందలాదిగా వెలుస్తున్న అనుమతులు లేని భవన నిర్మాణాలను ప్రోత్సహిస్తూ విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపించి అధికారుల తీరు పై స్థానికల నుండి వెలువడుతున్న ఆరోపణలు నిజమని రుజువైన యెడల విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావిచ్చినందుకు అధికారులను పూర్తి బాధ్యులను చేస్తూ తగు చర్యలు తీసుకొని ఆరు సంవత్సరాల వ్యవధిలో అక్రమ మార్గంలో దోపిడి చేసిన అక్రమ ఆస్తులపై సోదాలు నిర్వహించి అక్రమ ఆస్తులను జప్తు చేసి జవహర్ నగర్ లో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణమైన గృహ నిర్మాణాలపై చర్యలు తీసుకొని గృహ నిర్మాణాలకు పూర్తి అనుమతులు లభించే సదవకాశాన్ని స్థానికులకు కల్పించి జవహర్ నగర్ అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## ప్రపంచానికి గేట్ వే గా ఫ్యూచర్ సిటీ

- హైదరాబాద్ ను ప్రపంచానికి గేట్ వే గా మార్చే నగరం ప్రజా ప్రభుత్వం నిర్మించబోయే ఫ్యూచర్ సిటీ

**జయభేరి, హైదరాబాద్ :**

రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్ పేట్ లో "ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్" నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాను. ప్రజల సహకారం, రైతుల త్యాగాల తో అద్భుతమైన నగరాన్ని నిర్మిస్తాం. నూతన నగర నిర్మాణంలో నష్టపోతున్న ప్రతి ఒక్కరిని ఆదుకునే బాధ్యత నాది. సామాన్యులు, పేదల విషయంలో అధికారులు మానవీయ కోణంలో ఆలోచన చేయాలి. ఇక ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు మల్కాజ్ గిరి కమిషనరేట్ భవనం, OCTOPUS అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ DCP కార్యాలయ భవనాలను ప్రారంభించాను. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాను. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, శాసన మండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనీల్ కుమార్ యాదవ్, శాసన సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 1.75 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**జయభేరి, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రాయపోల్ గ్రామంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర లభించేలా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

గ్రామంలో 1.75 లక్షల నిధులతో అభివృద్ధి...

గ్రామాభివృద్ధికి మరో ముందడుగు వేస్తూ రూ.1.75 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శ్రీకారం చుట్టారు. రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధితో రాయపోల్ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ గ్రామాభివృద్ధి, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. రాయపోల్ అభివృద్ధికి ఇది నాంది అని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## పాత్రికేయుడికి ఆర్థిక చేయూత అందించిన మాజీ కౌన్సిలర్ శంకర్



**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ పాత్రికేయుడు తేజోమూర్తి (సాక్షిత పేపర్) తల్లి అనారోగ్యానికి గురైన విషయం యూనియన్ నాయకుల ద్వారా తెలుసుకున్న దుండిగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ వారి కుటుంబ సభ్యులను కలిశారు. చికిత్స కోసం మంగళవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో తేజోమూర్తి కి రూ. 21 వేల ఆర్థిక చేయూతను అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గోలిపల్లి దయాకర్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి బాబా, ప్రధాన కార్యదర్శి రెడ్డె బోయిన మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. ఆర్థిక సహాయం అందించినందుకు యూనియన్ నాయకులు శంకర్ నాయక్కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నూతన కమిషనర్ ను కలిసిన టీయుడబ్ల్యూజే నేతలు



**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జి.ముకుందరెడ్డిని, ఇవ్వాళ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బాధ్యులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు.

## సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్


**జయభేరి, కరీంనగర్ :**



మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామాల వారిగా పెండింగ్ పనులు,అభివృద్ధి కార్యక్రమాలు తీసుకోవాల్సిన కార్యాచరణ పై సమీక్ష ప్రత్యేక కమిటీల ఏర్పాటు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షుడు దొంత సుధాకర్,మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి, ఇతర ముఖ్య నేతలు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు పెండింగ్ పనులు త్వరగా పూర్తి కావాలి. బూత్ లెవెల్ ఏజెంట్ లు నియమించి సర్ లో ఓట్ల తొలగింపు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వ స్కూల్ అడ్మిషన్ ల సంఖ్య పెంచాలి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో వచ్చే వర్షాకాలంలో ప్లాంటేషన్ చేయాలి ప్రత్యేక కమిటీ. ధాన్యం కొనుగోలు లో సమస్యలు రాకుండా ఐదు మంది రైతులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలి. ఒక్కో మండలానికి ఒక్కో మెడికల్ కాలేజీ దత్తత తీసుకున్నాయి ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో రోడ్లు, బ్రిడ్జి కు సంక్షన్ అయి పనులు ప్రారంభం కానివి ప్రారంభం అయ్యేలా చూడాలి. మండల కార్యవర్గం పునర్వ్యవస్థీకరణ చేస్తాం గ్రామాల్లో పార్టీ క్యాడర్ బలోపేతం చేయాలి. నన్ను గెలిపిస్తే హుస్నాబాద్ నియోజకవర్గం అంటే గౌరవం పెంచుత అని చెప్పా గౌరవాన్ని పెంచేలా చేస్తున్న. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.

## ఈఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు తెలంగాణ ఉద్యమకాల ఫోరం ఘన సన్మానం

**జయభేరి, సికింద్రాబాద్:**



తెలంగాణ ప్రభుత్వం వైద్యుల సంఘం ఈఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు తెలంగాణ ఉద్యమకాల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా అభినందనలు తెలిపారు. వైద్య రంగంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈఎస్ఐ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నిక కావడం గర్వకారణమని ఫోరం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకాల ఫోరం రాష్ట్ర వైస్ చైర్మన్ గుండు దయానంద్ మాట్లాడుతూ డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో వైద్యుల సమస్యల పరిష్కారానికి పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ తెలంగాణ ఉద్యమ కన్వీనర్ జగన్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సమాజ సేవలో ముందుండే నాయకత్వం వైద్య రంగానికి ఎంతో అవసరమని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఆర్కే భూపాల్ మాట్లాడుతూ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఎన్నికతో ఈఎస్ఐ వైద్యుల సంఘానికి కొత్త దిశ లభిస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వైద్యుల హక్కుల పరిరక్షణతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు తెలంగాణ ఉద్యమకారులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## బిల్లు వీగిపోవడం మోడీ వ్యూహమె

**జయభేరి, హైదరాబాద్ :**

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో చట్ట సవరణలు చేశారు. ఎంత మెజారిటీ ఉండాలో మనకు ఎంత బలం ఉందో మనం పెట్టే బిల్లుకు మెజారిటీ మన దగ్గర లేక పోతే బిల్లు ముందుకు పోదని, విజ్ఞత రీతిలో ప్రతిపక్షాలను పిలిచి అఖిలపక్షం ఏర్పాటు చేసి అందరి అనుమానాలు నివృత్తి చేసి, వాళ్లను అందరినీ మెప్పించి ఒప్పించి పార్లమెంట్ లో బిల్లుపెట్టితే బిల్లుకు రావాల్సిన మెజారిటీ కచ్చితంగా వస్తుంది. మహిళా బిల్లు పెట్టినప్పుడు షరతులు ఎందుకు పెట్టాలి?వ్యూహాత్మకంగా అడ్డుకోడానికే కదా. ప్రస్తుతం బిల్లు సవరణలకు పెట్టినప్పుడు కూడా ఏకపక్షంగా, ఒంటెద్దు పోకడలకు పోయి వ్యూహాత్మకంగానే ఈ బిల్లు ఒడి పోయేలా చేసి. మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి అని ప్రతిపక్షాల మీద బురుదా చాల్లు తున్నారు. మోడీ తనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకొని గెలిచారు అనేది జగమెరిగిన సత్యం ఈ బిల్లు విషయంలో మహిళల పట్ల మోడీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఈ బిల్లును పాస్ చేయించడానికి అనుసరించిన విధానం చూస్తే ఇట్టే అర్థం అవుతుంది. మహిళా వ్యతిరేకి బీజేపీ అనేది బహిరంగ రహస్యమే కదా! ఇప్పటికైనా మహిళలు, పార్టీలకు అతీతంగా తమ రిజర్వేషన్ హక్కుల కోసం నడుం కట్టాలని ఆకాంక్ష!

**పస్క నర్సయ్య**
Ex ఎంపీపీ,
DCC జిల్లా ప్రధాన కార్యదర్శి, 99489 91100



## టీకాలు వేయించుకునేందుకు వచ్చే చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యాలు

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్ పూరిలోని ఎమ్మెల్యే నివాసంలో అయోధ్యనగర్ PHC సబ్‌సెంటర్ వైద్యాధికారి డా. విజయారాణి కలిసి, సబ్‌సెంటర్‌లో నెలకొన్న సమస్యలను వివరించారు. అయోధ్యనగర్ సబ్‌సెంటర్‌లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాల కొరతతో పాటు, చాలా చిన్న గది కారణంగా రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా టీకాలు వేయించుకునేందుకు వచ్చే చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. అదేవిధంగా, సమీపంలోని పానీయాల దుకాణం వల్ల రాత్రివేళల్లో గోడల వద్ద చెత్త, బాటిళ్లు వేయడం జరుగుతోందని, వర్షాకాలంలో గదిలో నీటి లీకేజీ సమస్య ఉందని వివరించారు. పక్కనే భోజనం చేసే వారు ప్లేట్లు గోడలకు విసరడం వల్ల పరిశుభ్రత దెబ్బతింటోందని తెలిపారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

## చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలి

- కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

కాప్రా MRO కార్యాలయంలో కాప్రా మండలానికి చెందిన 80 మందికి కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో MRO రాజేష్ DT ప్రవీణ్ MRO కార్యాలయం అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మండలంలో అభివృద్ధి పనులపై విద్యుత్ అధికారుల సమీక్ష



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ అభివృద్ధి పనులను ఈరోజు మేడ్చల్ చీఫ్ ఇంజనీర్ రమేష్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కరుణాకర్ బాబు పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న ప్రాంతాల్లో అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట కొత్త విద్యుత్ లైన్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అప్రమత్తంగా పనిచేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజనల్ ఇంజనీర్ జాన్ పోతురాజు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజ మల్లేష్, ఏఈలు రాంబాబు, మౌలాలి ప్రాంత సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాయ సముద్రం చెరువును పరిశీలించిన సైబరాబాద్ కమిషనర్ శ్రీజన

**జయభేరి, పటాన్ చెరు :**

స్థానిక రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ విజ్ఞప్తి మేరకు ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన రామచంద్రపురం డివిజన్ లో ఉన్న రాయ సముద్రం చెరువు ను సందర్శించారు. గతంలో కార్పొరేటర్ గా ఉన్నపుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో ఎంతో కష్టపడి చెరువు సుందరీకరణ కొరకు హెచ్ఎండిఏ ద్వారా సుమారు 10.00 కోట్ల నిధులు మంజూరు చేయించగా, అలాగే అప్పటి జిహెచ్ఎంసి ద్వారా డ్రైనేజీ నీరు చెరువు లో కలవకుండా పైప్ లైన్ ద్వారా మళ్లింపు కొరకు 2.50 కోట్లు మంజూరు చెయ్యగా, పనులు ప్రారంభం చేస్తుంటే భెల్ యాజమాన్యం చెరువు తమదని, ఎలాంటి అభివృద్ధి కాని, ఎలాంటి చర్యలు కానీ, మీరు తీసుకోవద్దని పనులు జరుగ కుండా అడ్డుకున్నారు. ఇదే విషయం కమీషనర్ కి వివరించగా ఆమె ఈరోజు పర్యటించారు. వెంటనే సంబధిత ఇరిగేషన్, సీఎంసీ, భెల్ యాజమాన్యంతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పనులను త్వరగా చేపట్టే దిశగా అడుగులు వేయిస్తానని హామీ ఇచ్చారు.

# పరవాసుదేవ అలంకారంలో నారసింహుడు

- యాదగిరిగుట్టలో కన్నులపండువగా నృసింహ జయంత్యోత్సవాలు

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 28 :**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారు భక్త జనులకు పరవాసుదేవ అలంకారంలో దర్శనమిచ్చారు. యాదగిరిగుట్టలో జరుగుతున్న నృసింహ జయంత్యోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి.

**ఉత్సవాల్లో భాగంగా మంగళవారం**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి అలంకార సేవను ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం యాగశాలలో ద్వార తోరన పూజ,మూర్తి కుంభారాధన, చతుఃస్థానార్చన,లక్ష్మీ నృసింహ సుదర్శన, గరుడ, మూలమంత్ర హోమాలు, నిత్య పూర్ణాహుతిని అర్చకులు,వేదపండితులు, రుత్వికులు,ఆలయ అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పరవాసుదేవ అలంకారంలో శ్రీలక్ష్మీ నృసింహుడు ఆలయ మాఢా వీధుల్లో విహరిస్తూ భక్తజనులకు దర్శనమిచ్చాడు. సేవ అనంతరం సాయమారాధన, ద్వారతోరణపూజ, చతుఃస్థానార్చన,లక్ష్మీ నృసింహ సుదర్శన,గరుడ మూలమంత్ర హవనములు, నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి ,అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన భక్తులకు నృసింహ జయంత్యోత్సవాల విశిష్టతను అర్చకులు వివరించారు. ఉత్సవాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్‌తో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...**

నృసింహ జయంత్యోత్సవాల్లో భాగంగా యాదాద్రి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి మహిళా భజన మండలి,భాగ్యలక్ష్మి మహిళా భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, చింతా రవి బాల కృష్ణ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, యక్షగానం, డా.వనజా ఉదయ్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

**ఉత్సవాల్లో నేడు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి నృసింహ జయంత్యోత్సవాలలో భాగంగా నేడు ఉదయం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అలంకార సేవ, యాగశాలలో ద్వారతోరణ పూజ, మూర్తి కుంభారాధన, చతుఃస్థానార్చన, లక్ష్మీనృసింహ సుదర్శన, గరుడ, మూలమంత్ర హోమములు, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు.

**పాతగుట్టలో..**

యాదగిరిగుట్ట ఆలయ అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో నృసింహ జయంత్యోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం యాగశాలలో ద్వారతోరణ పూజ, మూర్తి కుంభారాధన, లక్ష్మీ నృసింహ, సుదర్శన,గరుడ మూలమంత్ర హోమములు,నిత్యపూర్ణాహుతి,లక్ష కుంకు మార్చన,సాయంత్రం సాయమారాధన, చతుఃస్థానార్చన, మూలమంత్ర హోమాలు, నిత్యపూర్ణాహుతి వేదోక్తంగా నిర్వహించారు.

# మేడ్చల్ సర్కిల్ లో పెరుగుతున్న అక్రమ షెడ్ల నిర్మాణాలు

**జయభేరి, మేడ్చల్ :**



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఖాళీ స్థలాలు, రహదారి పక్కలు, నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాల్లో షెడ్లు నిర్మించడం వల్ల పట్టణ ప్రణాళికకు విఘాతం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్, కిష్టాపూర్ డివిజన్ ప్రాంతాల్లో అధికారుల అనుమతి లేకుండానే కొందరు తాత్కాలిక షెడ్లు నిర్మించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రహదారుల వెంట, కాలువల పక్కన, వ్యవసాయ భూములలో అక్రమ షెడ్లు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానిక ప్రజల ఫిర్యాదులు ఉన్నప్పటికీ కొన్ని చోట్ల అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని షెడ్లను గుర్తించి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నగర అభివృద్ధికి ఆటంకం కలిగించే ఇటువంటి నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమాలపై నియంత్రణ సాధించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# కోరిన కోర్కెలు.. తీర్చే దైవం

- 30 నుండి మన్యం కొండ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 1న కల్యాణ మహోత్సవం

**జయభేరి, దేవరకద్ర :**





మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన, రాయచూర్ అంతర్రాష్ట్ర సమీపంలోనున్న శ్రీ లక్ష్మీనరసింహ (ఓబులేషు) స్వామివారి ఉత్సవాలు ఈనెల 30 నుండి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 2 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా స్వామివారి ఉత్సవాలకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలలోని మొదటి రోజు ఈ నెల 30న శుద్ధి పుణ్యహవాచనం, రాత్రికి హనుమత్ వాహన సేవ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే మే 1న స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. అలాగే అదే రోజు రాత్రి స్వామివారి గరుడవాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2న వసంతోత్సవం, అవబృత స్నానం పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి దేవస్థానాన్ని రంగురంగు విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.కావున ఈ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని మన్యంకొండ దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, పాలక మండలి సభ్యులు కోరారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాలతో స్పందించిన అధికారులు


- ధాన్యం కొనుగోలుకు మార్గం సుగమం
- పిఎసిఎస్ సీఈవోలు, ఏపీఎం అధికారులు, రైస్ మిల్లర్స్ ఓనర్స్, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ లతో వనపర్తి జిల్లా జాయింట్ కలెక్టర్ సమీక్ష

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాలతో ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు మంగళవారం స్పందించారు. కొత్తకోట పట్టణ రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం కొత్తకోట పట్టణంలో ఆకస్మాత్తుగా సందర్శించి కార్యాలయంలో వడ్ల కొనుగోలు విషయంలో సమావేశాన్ని నిర్వహించారు.

పిఎసిఎస్ సీఈవోలు, ఏపీఎం అధికారులు, రైస్ మిల్లర్స్ ఓనర్స్, ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్ లతో లారీల విషయంలో, గన్ని బ్యాగుల గురించి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు విషయాలపై చర్చించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లె పోగు ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాసరెడ్డి, చర్లపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి లతోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు స్పందించడంతో రైతులు సంతోషం వ్యక్తపరిచారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 28 :**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి, తుర్కపల్లి, తిరుమలపురం, ములకలపల్లి గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. నాణ్యమైన వడ్లను అమ్మి మంచి ధరను పొందాలని అన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమత తిరుపతిరెడ్డి, సర్పంచులు సోమల వెంకటేశం, బానోతు బులి వీరన్న, తునికి లక్ష్మీ రాంరెడ్డి, దొనికేని రేణుక వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ కానుగంటి శ్రీనివాస్ యాదవ్, నాయకులు దేవరుప్పల ఐలయ్య, రామగొని వెంకటేష్ గౌడ్, పనిగట్ల సుదర్శన్, దొమ్మాట బాబు, శివరాత్రి జహంగీర్, జింకల ఎల్లేష్ యాదవ్, పిఎసిఎస్ సీఈఓ లు నారా రమేష్, బోరేడ్డి జనార్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కారు బీబత్సవం

**జయభేరి, హయత్‌నగర్ :**

ఇంజాపూర్ రోడ్‌లోని శ్రీ రాఘవేంద్ర టింబర్ డిపో సమీపంలో 28.04.2026 సాయంత్రం 18:45 గంటల సమయంలో మద్యం సేవించిన స్థితిలో ముగ్గురు వ్యక్తులు కారును (నంబర్: TS04FG9129) నిర్లక్ష్యంగా నడుపుతూ, దుకాణాల ముందుకు పార్క్ చేసి ఉన్న బైక్‌లను ఢీకొట్టిన ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో వాహనాలకు భారీ నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే హయత్‌నగర్ పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 721/2026 కింద సెక్షన్లు 125, 281 BNS & 185 MV Act ప్రకారం కేసు నమోదు చేయబడింది. ఈ విషయమై తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

## అనుమానాస్పద మృతి



**జయభేరి, హయత్‌నగర్ :**

మందారి నాగయ్య (65), స/o బాలయ్య, చాకలి (మందారి), మున్సిపల్ ప్రైవేట్ ఉద్యోగి, తొర్రూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 28.04.2026 నాడు మధ్యాహ్నం సుమారు 13:30 గంటల సమయంలో మరణించినట్లు పోలీసులకు సమాచారం అందినది. ఈ వ్యక్తి గత 20 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలిసినది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు చర్యలు చేపట్టి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 719/2026 కింద సెక్షన్ 194 BNSS ప్రకారం కేసు నమోదు చేయబడింది. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

# పర్యాటక 'ప్రభ' పెంచుదాం!

- తెలంగాణను మేటి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి
- హైదరాబాద్ లో భారీ స్థాయిలో కార్నివల్ నిర్వహణ
- పర్యాటక కేంద్రాల్లో వీకెండ్ లో సాంస్కృతిక ప్రదర్శనలు
- పర్యాటక ప్రాజెక్ట్ ల అభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించండి
- అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశం



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 28 :**

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు అత్యంత అనువైన ప్రాంతమని, ఆ దిశగా పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. మౌలిక వసతుల కల్పన, గమ్యస్థానాల బ్రాండింగ్, విస్తృత ప్రచార కార్యక్రమాలకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో నిర్వహించిన పర్యాటక సలహా కమిటీ/ మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని వారసత్వ సంపద, సంస్కృతి, అద్భుతమైన కట్టడాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జల వనరులు,, దట్టమైన అడవులు, ఆధ్యాత్మిక కేంద్రాలను సమన్వయం చేస్తూ తెలంగాణను ఒక శక్తివంతమైన పర్యాటక హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు కనీస సౌకర్యాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని మంత్రి అధికారులకు సూచించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాత్కాలిక వసతి గదులు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లతో పాటు రహదారి పక్కన ఉండే విశ్రాంతి సౌకర్యాలను వెంటనే మెరుగుపర్చాలని, కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సలహా కమిటీ సమావేశంలో వెల్లడైన ప్రతిపాదనలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని, అమలు ప్రక్రియలో జాప్యం జరగకుండా ఒక నిర్దిష్ట పని లేదా ప్రాజెక్ట్ బాధ్యతను పర్యవేక్షించడానికి నోడల్ అధికారికి అప్పగించాలని సూచించారు. దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు నవంబరు లేదా డిసెంబరు మాసాల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు అధ్యయనం చేయాలని, సాధ్యమైనంత త్వరగా ప్రతిపాదనలు రూపొందించి, సమర్పించాలని చెప్పారు. ప్రారంభంలో ప్రభుత్వమే దీనిని చేపట్టినా, భవిష్యత్తులో ప్రైవేటు భాగస్వామ్యంతో స్వయం సమృద్ధిగా సాగేలా చూడాలని తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగర సుందరీకరణలో భాగంగా శిల్పాలు, ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్, స్కై వాక్ లు సృజనాత్మక ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని సోమశిల, వరంగల్, రామప్ప, యాదాద్రి, గోల్కొండ, తారామతి బరాదరి, నాగార్జున సాగర్ వంటి కీలక పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రధాన పర్యాటక కేంద్రాల్లో క్రమం తప్పకుండా వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ... మన రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, వనరులు ఉన్నప్పటికీ, ప్రచారంలో వెనుకబడి ఉన్నామని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, కెరావెన్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు ఆహ్వానించామని చెప్పారు. పెండింగ్ లో ఉన్న హరిత హోటళ్ల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని, వారసత్వ కట్టడాల నిర్వహణ కోసం 'ఆగాఖాన్' మోడల్‌లో ట్రస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడంతో పాటు మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం, ఎకో టూరిజం కేంద్రంగా ప్రచారం చేయాలని కమిటీ సభ్యులు ఈ సమావేశంలో ప్రతిపాదించారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా మార్కెట్లలో విస్తృత మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులు నొక్కి చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్టర్ అవుట్ రీచ్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అమలులో వేగం పెంచాలని సూచించారు. తెలంగాణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను అద్భుత కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చైనా, వియత్నాం వంటి దేశాల్లో అధ్యయన పర్యటనలు చేపట్టాలని, జైపూర్ సిటీతో పోటీ పడేలా హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాలను 'వెడ్డింగ్ డెస్టినేషన్స్‌గా తీర్చిదిద్దడం, కేరళ తరహాలో ప్రకృతి ఉత్పత్తులు, సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఈత, తాటి కల్లు, ఇతర ఉప ఉత్పత్తులను ప్రోత్సహిస్తూనే బ్రాండింగ్ చేయడం, వారసత్వ విధానం ఉండాలని, విదేశీయుల కంటే భారతీయులే పర్యాటకానికి ఎక్కువ ఖర్చు చేస్తారు, కాబట్టి స్వదేశీ పర్యాటకంపై దృష్టి పెట్టి తెలంగాణ పర్యాటక ప్రమోషన్, బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రచారానికి నిధులు కేటాయించాలి, మధ్యప్రాచ్యం నుండి పర్యాటకులను ఆకర్షించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ప్రతిపాదించారు. వరంగల్, సోమశిల వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో 3 నుండి 5 స్టార్ హోటళ్లను నిర్మించడం, బమ్మెరలో పోతన స్మృతి వనం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వరంగల్ హరిత హోటల్ నుంచి రామప్ప వరకు బస్సు సర్వీసులను నడపాలని కమిటీ సభ్యులు సూచించారు.

---



## జనగణన పారదర్శకంగా నిర్వహించాలి

- మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 28 :**

అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జనగణనపై సెల్ఫ్ ఎన్యూమరేషన్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మే నెల 10 తేదీ వరకు జనగణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తారని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ సెల్ఫ్ ఎన్యూమరేషన్ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

## షోర బాలికల అవగాహనా కార్యక్రమం

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం లో కిషోర బాలికల అవగాహనా పై ICDS& SERP ఆధ్వర్యం లో సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమమునకు కిషోర బాలికల తల్లీ దండ్రులను ఆహ్వానించి అవగాహన సమావేశం ఏర్పాటు చేయనైనది. 1ఆరోగ్యం 2 వ్యక్తి గత పరిశుభ్రత 3 సమత్తుల ఆహారం 4పీరియడ్ సమయం లో పరిశుభ్రత పాటించటం భద్రత పై కిషోర బాలికల సంఘాల అవసరం గురించే వారికీ వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలుగు APM జయప్రసాద్, ICDS సూపర్వైజర్ సత్యకుమారి, CC లు, NHC యాక్టివిస్ట్ K. సుజాత, CRp, shg మహిళలు తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శ్రమదాన కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్థానిక మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ దేవరకొండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక దేవరకొండ తహసిల్దార్ ఎం . మధుసూదన్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక , సేవా దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలన్నారు . కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల సిబ్బంది స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో R.I నిఖిల్ కుమార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ C లింగమయ్య సి.ఓ.ఈ జి లింగారెడ్డి తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

---

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ మహిళలకు ఆర్థిక భరోసా

- కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, వారి కుమార్తెల వివాహ సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆలేరు నియోజక వర్గం పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ బరిగే రమ్యారామచందర్, యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్ నాయక్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మదర్ డైరీ డైరెక్టర్ కల్లేపల్లి శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారపు బిక్షపతి గౌడ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

---




---



## మే 6 న నాయుడుపాలెం సిద్ధి వినాయక ఆలయ 8వ వార్షికోత్సవం

- కూండ్రపు వీఆర్వో శ్రీను ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం నాయుడుపాలెం గ్రామంలో కొలువై ఉన్న సిద్ధి వినాయక దేవాలయ 8వ వార్షికోత్సవ వేడుకలు మే 6 న (బుధవారం) ఘనంగా జరగనున్నాయి. గ్రామ ప్రజల సహాయ సహకారాలతో, కూండ్రపు వీఆర్వో శ్రీను ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మే 6వ తేదీ బుధవారం ఉదయం 7 గంటల నుండి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, విశేష అభిషేకాలు, మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడతాయి. సంతాన ప్రాప్తి, ఉద్యోగ ప్రాప్తి కలిగించే ఈ స్వామి వారి వార్షిక ఉత్సవాల్లో దంపతులు, యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉత్సవాల్లో పాల్గొనదలచిన వారు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి దాతల సహకారంతో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. భగవంతుని ఆశీస్సులు అందరికీ చెందాలని, ఈ ఉత్సవాలకు, అన్నసమారాధనకు విరాళాలు ఇవ్వదలచిన వారు ఆలయం వద్ద సంప్రదించవచ్చని తెలిపారు. వచ్చిన విరాళాలు, ఖర్చుల వివరాలను ఉత్సవం కార్యక్రమం అనంతరం పారదర్శకంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవంలో నాయుడుపాలెం గ్రామ పంచాయితీ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

---

## ఘనంగా తునికి బొల్లారంలో బాల మేళ



**జయభేరి, సిద్దిపేట, ఏప్రిల్ 28 :**

సిద్దిపేట జిల్లా తునికి బొల్లారంలోని అంగన్ వాడి కేంద్రంలో ఉపాధ్యాయురాలు శమంత ఆధ్వర్యంలో బాల మేళ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ వెంకన్న గారి ముత్యంరెడ్డి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రజిత హాజరయ్యారు. అనంతరం 3 నుండి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్ వాడి కేంద్రం ద్వారా అందుతున్న ఆట పాటలు, విద్య పై ఉపాధ్యాయురాలు శమంత తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం సర్పంచ్, అంగన్ వాడి సూపర్ వైజర్ లు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 3 నుండి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటల ద్వారా విద్య అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడ్యాల సర్పంచ్ ఎడ్ల పోచయ్య, కృష్ణ, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు భాస్కర్, పంచాయితీ కార్యదర్శి నర్సింహ, , నాగిరెడ్డి పల్లి టీడీపీఓ సరిత, భవాని, సౌజన్య, శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్ లు రాధిక, అనిత, లలిత, నవనీత, నాగరాణి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా?

- ఒక్కో విద్యార్థికి రూ.లక్ష వరకు ఖర్చు : సీఎం రేవంత్



**జయభేరి, హైదరాబాద్ :**

ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు స్కూళ్లు ఎందుకు గొప్ప అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సర్కార్ బడిలో ఒక్కో విద్యార్థికి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు స్కూల్లో మాత్రం రూ. 25 వేలే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50వేలకు పైగా నియామకాలు చేపట్టాం. ఉద్యోగ నియామకాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న చిక్కుముళ్లు విప్పుతూ సమస్యలు పరిష్కరించాం. గతంలో సంతలో సరకులా ప్రశ్నపత్రాలు అమ్మారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని పెద్దలు చెప్పారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 11వేల ప్రైవేటు పాఠశాలల్లో 36.7లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా? ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు రూ.25వేల వరకు ఖర్చవుతుంటే, ప్రభుత్వ బడుల్లో రూ. లక్ష వరకు ఖర్చవుతోంది. విద్యార్థుల భవిష్యత్తును విద్యాశాఖ తీర్చిదిద్దాలి. గతంలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైంది. విద్యాశాఖను ప్రక్షాళన చేసి ప్రభుత్వం అండగా ఉంది. విద్యకు ప్రాధాన్యం ఇచ్చి విద్యాశాఖకు రూ.21,650 కోట్లు కేటాయించాం అని సీఎం వివరించారు.

---

## జర్నలిస్ట్.. హత్య...

**జయభేరి, తిరుపతి, ఏప్రిల్ 28 :**

చిత్తూరు జిల్లాలో జర్నలిస్టును ఓ రౌడీ షీటర్ దారుణంగా హత్యచేశాడు. వెంకటగిరి కోట (వి.కోట)లో జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిని కత్తితో నరికి హత్య చేశారు. పాత కక్షలు, వ్యక్తిగత గొడవలతో హత్య చేసినట్లు తెలుస్తోంది. నిందితుడు తమీమ్ అనే రౌడీ షీటర్ అని, అతడికి జగన్మోహన్ రెడ్డికి మధ్య గత కొంతకాలంగా తీవ్రమైన విభేదాలు ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఇటీవల జరిగిన ఒక శ్రీగంధం స్మగ్లింగ్ కేసులో జగన్మోహన్ రెడ్డి పోలీసులకు సమాచారం అందించి సహకరించాడనే కోపంతోనే, తమీమ్ ఈ హత్య చేసినట్లు సమాచారం. ఈ హత్య పక్కా పథకం ప్రకారం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిరోజూ ఉదయం వాకింగ్‌కు వెళ్తారనే విషయాన్ని గమనించిన నిందితులు, ఆయన ఒంటరిగా ఉన్న సమయం చూసి వేటకొడవళ్లతో దాడి చేసి ప్రాణాలు తీశారు. హత్య అనంతరం నిందితుడు నేరుగా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూనే, అసాంఘిక కార్యకలాపాలకు వ్యతిరేకంగా వార్తలు రాయడం, పోలీసులకు సహకరించడమే జగన్మోహన్ రెడ్డి ప్రాణాల మీదకు తెచ్చిందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

# అరుదైన గౌరవం



ప్రస్తుతం యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉంది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. కేరళలో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా త్వరలో రష్మిక మందన్న ఓ గ్లోబల్ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నది. జపాన్‌లోని టోక్యోలో జరగనున్న గ్లోబల్ యానిమే అవార్డ్స్ వేడుకలో రష్మిక మందన్న ప్రజెంటర్‌గా వ్యవహరించనుంది. ప్రపంచవ్యాప్తంగా యానిమేషన్ రంగంలో అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన సాంకేతిక నిపుణులతో పాటు సినిమాలకు గత పదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. భారత్ నుంచి ఈ ఏడాది గ్లోబల్ యానిమే వేడుకలో పాల్గొంటున్న ఏకైక భారతీయ నటి రష్మిక మందన్న కావడం విశేషం. ఇదొక అరుదైన గౌరవమని అంటున్నారు. అయితే 2024లో జరిగిన గ్లోబల్ యానిమే ఈవెంట్‌లో కూడా రష్మిక మందన్న పాల్గొన్నది. ఈ వేడుకలో భాగమైన తొలి భారతీయురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. మరోమారు రష్మిక మందన్న ఈ గ్లోబల్ ఈవెంట్‌లో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది.





## త్రీ ఇడియట్స్ జీవితాల్లో పదేండ్ల తర్వాత?

బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'త్రీ ఇడియట్స్' విడుదలై 17ఏండ్లు అయింది. అయినా నేటికీ ఇది మరపు రాని చిత్రమే. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో ఆమీర్‌ఖాన్, మాధవన్, శర్మన్ జోషి, కరీనా కపూర్ నటించిన ఈ చిత్రానికి ప్రత్యేకంగా అభిమానులున్నారు. 2009లో విడుదలై అప్పటివరకూ ఉన్న బాక్సాఫీస్ రికార్డుల్నింటినీ తిరగరాసిన చిత్రమిది. ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ ఓ సందర్భంలో చెప్పారు. తాజాగా ఈ సీక్వెల్ గురించి చిత్ర కథానాయకుడు అమీర్‌ఖాన్ స్పందించారు. 'రాజు (రాజ్‌కుమార్ హిరానీ) ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌లో బిజీగా ఉన్నారు. రీసెంట్‌గా కథ విన్నాను. అద్భుతంగా అనిపించింది. విభిన్నమైన పాయింట్‌తో ఈ సినిమా రానున్నది. 'త్రీ ఇడియట్స్' ముగింపు నుంచి పదేండ్ల తర్వాత మా పాత్రల జీవితాల్లో ఏం జరిగిందనే అంశం చుట్టూ ఈ కథ సాగుతుంది. 'త్రీ ఇడియట్స్'లో ఉన్న కామెడీ ఈ సీక్వెల్‌లో కూడా ఉంటుంది. అయితే.. స్క్రీన్‌ప్లే విషయంలో కొంత పని మిగిలివుంది' అని తెలిపారు అమీర్‌ఖాన్.

## గెటప్ రెడీ.. ఇక మిగిలింది యాక్షనే!




అగ్ర కథానాయకుడు చిరంజీవి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని చిరంజీవి పాత్రకు సంబంధించిన లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తయింది. ఇందులో మెగాస్టార్ పవర్‌ఫుల్, స్ట్రైకింగ్ లుక్‌లో కనిపిస్తారని లుక్ టెస్ట్‌ని బట్టి అర్థమవుతున్నది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవిబాబీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ రెండో చిత్రం మెగా అభిమానులకు విందు భోజనంలా ఉంటుందని సమాచారం. మాస్ ఎంటర్‌టైనర్స్ తీయడంలో సిద్ధహస్తుడైన బాబీ ఈసారి మెగాస్టార్ కోసం ఇంటెన్స్ క్యారెక్టర్‌ని డిజైన్ చేశారని, మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్ మరింత ఎలివేట్ అయ్యేలా స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ముహూర్తం, రెగ్యులర్ షూటింగ్ వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటిస్తారు.



## 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్!

సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోళీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.

## 'దేవర' బుల్లితెరపై ఇంకా ఎందుకు ప్రసారం కాలేదు..



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించి, ఓటీటీలోనూ సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే ఆశ్చర్యకరంగా ఈ చిత్రం థియేటర్లలో విడుదలై 578 రోజులు దాటినా ఇప్పటివరకు బుల్లితెరపై ప్రసారం కాలేదు. దీంతో ఎన్టీఆర్ అభిమానులతో పాటు టీవీ ఆడియన్స్‌లో కూడా ఆసక్తి పెరుగుతోంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామా ఎన్టీఆర్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలిచింది. పవర్‌ఫుల్ కథ, ఎన్టీఆర్ మాస్ పర్ఫార్మెన్స్, అలాగే అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. థియేటర్లలో వసూళ్ల వర్షం కురిపించిన 'దేవర', ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన తర్వాత కూడా గ్లోబల్ ట్రెండింగ్‌లో నిలిచి తన ప్రభావాన్ని కొనసాగించింది. అయితే సాధారణంగా స్టార్ హీరోల సినిమాలు థియేటర్లలో విడుదలైన మూడు నుంచి ఆరు నెలల్లోనే టీవీల్లో ప్రసారం అవుతుంటాయి. ఉదాహరణకు ఎన్టీఆర్ గత చిత్రం RRR కూడా తక్కువ కాలంలోనే బుల్లితెరపైకి వచ్చింది. కానీ 'దేవర' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. విడుదలై దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఏ ఛానల్‌లోనూ టెలికాస్ట్ కాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, శాటిలైట్ హక్కుల డీల్ ఇంకా ఫైనల్ కాకపోవడమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. నిర్మాతలు భారీ ధర కోరుతుండగా, ఛానెల్స్ ఆ రేటుకు ముందుకు రావడంలేదని టాక్ వినిపిస్తోంది. దీంతో ఈ డీల్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఇక బుల్లితెర ప్రేక్షకుల విషయానికి వస్తే, ఇప్పటికీ లక్షలాది మంది ప్రేక్షకులు టీవీల ద్వారానే సినిమాలు చూస్తుంటారు. స్మార్ట్ టీవీలు లేదా ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు లేని వారు 'దేవర' టెలికాస్ట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా టీవీలో ప్రసారమైతే 15కు పైగా టీఆర్పీ రేటింగ్ సాధించే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే, 'దేవర' తర్వాత వచ్చిన కొన్ని సినిమాలు ఇప్పటికే టీవీల్లో ప్రసారం అయ్యేందుకు సిద్ధమవుతున్నాయి. అయినప్పటికీ ఈ సినిమా శాటిలైట్ డీల్ మాత్రం ఇంకా పూర్తి కాకపోవడం ఆశ్చర్యకరం. ఇదే పరిస్థితి కొనసాగితే, పార్ట్ 1 టీవీలో రాకముందే 'దేవర పార్ట్ 2' అప్‌డేట్స్ కూడా రావొచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**